క్లుప్తంగా

విద్యా సామర్థ్యాల పరిశీలన



చెన్నయవలసలో విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ మాధవరావు

జలుమూరు: బోధనలో మార్పుల ద్వారానే విద్యా సామర్థ్యాలు మరింత మెరుగుపడతాయని ఎంఈఓలు బి.మాధవరావు, ఆర్.వి.ఎస్.ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రం జలుమూరుతోపాటు చెన్నయవలస ప్రాథమిక పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పరిశీలించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి



సత్సంగంలో పాల్గొన్న ఆధ్యాత్మిక వేత్తలు

సారవకోట: సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భగవద్గీత పారాయణ ప్రచారకులు, ఆధ్యాత్మిక వేత్త కంచుమోజు రామ్మోహన్ అన్నారు. గురువారం మండలంలోని కిన్నెరవాడ గ్రామం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. రామ్మోహన్ మాట్లాడుతూ మన ఆచార, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడాలన్నారు. యోగా చంద్రశేఖర్, గుళ్ల సూర్యనారాయణ, సనపల కరుణాకర్, బోయిన వెంకటరమణ, సిద్ధయ్య స్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.

నిబంధనలు తప్పనిసరి



తేమ శాతం, యంత్రం పనితీరును వివరిస్తున్న అధికారులు

నరసన్నపేట: ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలని, కొనుగోలు కేంద్రాల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత, సివిల్ సప్లై డీటీ రామకృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సిబ్బందికి, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. డీటీ రామకృష్ణ మాట్లాడుతూ తేమ శాతం లెక్కించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైస్ మిల్లుల్లో తేమ శాతం ఎలా చూస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలా తేమ శాతం తెలుసుకోవాలనే దానిపై సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వచ్చేటప్పుడు రైతులకు తగిన సూచనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీ సరితతో పాటు కొనుగోలు కేంద్రాల టెక్నికల్ అసిస్టెంట్లు, వీఏఏలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



దూసిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని వనజంగిపేట, దూసిపేట గ్రామాలలో నిర్వహించిన పల్లె పండగ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా నిర్మాణం చేపట్టనున్న సీసీ రహదారులు, డ్రైనేజీలకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దూసిపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని, లేకపోతే కఠిన చర్యలు చేపడతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రోణంకి వెంకటరావు, అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఎర్రన్నపేటలో మహిళలకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

జలుమూరు: గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్య పరిశీలకులు యు.చిన్నరాజులు సూచించారు. గురువారం టి.లింగాలపాడు పంచాయతీ పరిధి ఎర్రన్నపేట, సంతలుబైలు గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. వాక్సిన్ల వేయడం వల్ల అప్పుడే పుట్టిన బిడ్డలకు క్షయ, పోలియో, దగ్గు ధనుర్వాతం, పచ్చకామెర్లు, నిమోనియా తదితర వ్యాధులను అరికట్టవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ధనలక్ష్మి, సిబ్బంది రూప, రవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందేదెలా?



ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట సెంటర్ నుంచి తురకపేట గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన స్థానికుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరు పనిచేయడంలేదు. ఐదు నెలల క్రితం బోరు మరమ్మతులకు గురైంది. నీటి అవసరాలకు చెరువుకు వెళ్లాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి బోరును బాగు చేయాలని కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

శిథిలావస్థలో..



కొత్తూరు మండలం కర్లెమ్మ గ్రామ సమీపంలోని అలికాం–బత్తిలి రోడ్డులో హడ్డుబంగి గెడ్డపై వంద ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలమైంది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. ఆంధ్రా–ఒడిశాలకు అనుసంధానం ఉన్న ఈ రోడ్డులో ప్రతి నిత్యం బస్సులు, ఇతర వాహనాలతోపాటు ఒడిశా, చత్తీష్‌గడ్, మధ్యప్రదేశ్ నుంచి భారీ లోడులతో లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇదేచోట నూతన వంతెన నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- కొత్తూరు

లక్ష్యానికి దూరంగా..



ఆమదాలవలస పట్టణంలో 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో రూ.90 లక్షల వ్యయంతో మార్కెట్ భవనాన్ని నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే కూన రవికుమార్ 2019 ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించారు. కూరగాయల వ్యాపారం చేసే వారందరికీ భవన సముదాయంలో దుకాణాలు అందిస్తామని మాట ఇచ్చారు. నిర్మాణాలు అనువుగా లేకపోవడంతో ఆ భవనాల్లోకి వర్తకులు ఎవ్వరూ వెళ్లలేదు. అప్పటి నుంచి ఈ భవనం నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- ఆమదాలవలస

కిటికీ తలుపులు వేసేదెప్పుడు?



ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం కిటికీలకు తలుపు ఎప్పుడు వేస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. కిటికీల తలుపులు విరిగిపోవటంతో దోమలు, ఇతర కీటకాలు ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తలుపుల స్థానంలో దుస్తులు అడ్డంగా ఉంచుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి హాస్టల్ గదుల కిటికీలకు తలుపులు బిగించాలని కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

పారిశుధ్యం.. ప్రతిజ్ఞకే పరిమితం



మండల పరిషత్ వద్ద పారిశుధ్య ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది (ఫైల్)

- గ్రామాల్లో ఎక్కడా ఉపయోగంలోకి రాని చెత్త సంపద కేంద్రాలు
- పారిశుధ్య పనులపై పర్యవేక్షణ కరువు..
- గ్రీన్ అంబాసిడర్లకు అందని గౌరవ వేతనాలు

పోలాకి: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవు. పారిశుధ్య కార్యక్రమాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం పర్యవేక్షించాలి. అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే అధికారులందరితో కూటమి ప్రభుత్వం ఒక ప్రతిజ్ఞ చేయించింది. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్క అధికారి కూడా క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బందితోసహా గ్రామాల్లో ఎక్కడా అపారిశుధ్యం అనేది లేకుండా తనవంతు బాధ్యతగా ఈ ప్రతిజ్ఞ చేయించింది ఈ ప్రభుత్వం. అయితే ఆ ప్రతిజ్ఞ పోలాకి మండలంలో అధికారులు అక్కడే మర్చిపోయినట్లు కన్పించింది. గ్రీన్ అంబాసిడర్లకు కూడా సుమారు నాలుగు నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదు.

ఎక్కడ చెత్త అక్కడే..

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఎక్కడా ఉపయోగంలోకి రాలేదు. తొలిత ఏదైనా ఒక్క ఎస్‌డబ్ల్యూపీసీ అయినా వినియోగంలోకి తీసుకురావాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తున్నా క్షేత్రస్థాయిలో అలాంటి ప్రయత్నాలేమీ జరిగినట్లు కనిపించటంలేదు. ముఖ్యంగా గుప్పెడుపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, కోడూరు, బెలమరపాలవలస, జడూరు, పిరువాడ, పోలాకి పంచాయతీల్లో బహిరంగంగానే చెత్తచెదారాలు పడేయటంతో అటుగా వెళ్లినవారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నరసన్నపేట నియోజకవర్గంలోని పంచాయతీలు, ఎస్‌డబ్ల్యూపీసీల వివరాలు ఇలా..

మండలం	పంచాయతీలు	ఎస్‌డబ్ల్యూపీసీలు	గ్రీన్ అంబాసిడర్లు
పోలాకి	31	28	76
జలుమూరు	40	36	92
నరసన్నపేట	34	32	75
సారవకోట	35	26	55



బెలమర వద్ద రహదా పక్కనే వేసిన చెత్తాచెదారం



పోలాకి మండల కేంద్రంలో సామూహిక మరుగుదొడ్ల దుస్థితి



ప్రస్తుతం వినియోగంలో లేని ఒకప్పటి జిల్లాలోనే పోలాకి ఆదర్శ ఎస్‌డబ్ల్యూపీసీ

పంచాయతీ సిబ్బంది దృష్టి సారించాలి

గ్రామాల్లో అపారిశుధ్యంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. రహదారుల పక్కన, ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో ఎక్కడపడితే అక్కడే చెత్తవేస్తున్నా.. పంచాయతీ సిబ్బంది పట్టించుకోవటంలేదు. ముఖ్యంగా పిన్నింటిపేట వ్యాపార కేంద్రంలో చికెన్ దుకాణాల వ్యర్థాలు ఆరుబయట పారేయటంతో దుర్గంధం ఎక్కువైంది. అటుగా వేళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంది.

– సాలిన నగేష్‌కుమార్, యువకుడు, కోడూరు, పోలాకి మండలం

ప్రకటనలకే పరిమితం కాకూడదు..



పారిశుధ్య ప్రతిజ్ఞ అనేది కేవలం ప్రకటనలకే పరిమితం కాకూడదు. ఆర్థిక సంఘ నిధులతోపాటు క్షేత్రస్థాయిలో పరిస్థితి మేరకు అవసరమైతే పంచాయతీల్లోని జనరల్ ఫండ్స్ నుంచి అయినా సరే నిధులు వెచ్చించి పనులు చేపట్టాలి. ఎంపీడీఓ పర్యవేక్షణలో ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టాలి.

– కరిమి ఉమ, మాజీ ఎంపీపీ, పోలాకి

పంచాయతీల నుంచే బిల్లులు ఇస్తున్నాం..

గ్రామాల్లో పారిశుధ్య పనులకు పంచాయతీల నుంచి బిల్లులు వెంటనే చెల్లిస్తున్నాం. ఎక్కడైనా అపారిశుధ్య వాతావరణం కన్పిస్తే తక్షణమే స్పందించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి ఇటీవల సుమారు రూ.42 లక్షలు ఖర్చుచేసి చెత్తాచెదారాలను తొలగించాం. వీలైనంత తొందరలో ఎస్‌డబ్ల్యూపీసీలను అందుబాటులోకి తెస్తాం.

– బి.పద్మావతి, ఈఓపీఆర్డీ, పోలాకి

హామీలు అమలు చేసేది ఎప్పుడు బాబూ?

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు దిక్కు లేకుండా పోయిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందని, అందరి సంక్షేమమే చంద్రబాబు ధ్యేయమని కూటమి నాయకులు ప్రజలను నమ్మించారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేందుకు కూటమి నాయకులు చంద్రబాబుపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేకపోతున్నారని ప్రశ్నించారు. మరో నెల రోజుల్లోనే వరిచేను కోతలతో ఖరీఫ్ సీజన్ పూర్తవుతుందన్నారు. రైతులకు పంట పెట్టుబడి కోసం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం ఏమైందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి సాయం లేనట్లేనా అని నిలదీశారు. ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు నెలకు రూ.1500 సహాయం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఎమైయ్యాయని ప్రశ్నించారు. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఎప్పుడు ఇస్తారన్నారు. అప్పులు చేసి ఫీజులు కట్టేందుకు, పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బీసీలకు 50 ఏళ్లకే ఇస్తామన్న పింఛన్‌ను ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక అని చెప్పి టీడీపీ నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. మద్యం వ్యాపారంలో కూటమి నాయకులకు లబ్ధి జరిగేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయలేమని చెప్పుకోలేని రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. రాజకీయాలతో పనిలేకుండా అర్హతే ప్రమాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలు అమలులో జగనన్న వెనుకంజ వేయలేదన్నారు. సంక్షేమ పథకాలు అమలతోపాటు ప్రతీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారని గుర్తుచేశారు. రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

తమ్మినేనికి అభినందనలు



తమ్మినేనికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఆమదాలవలస: శ్రీకాకుళం వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పరిశీలకునిగా ఇటీవల నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆయన నివాసం వద్ద ఎల్.ఎన్.పేట మండలానికి చెందిన నాయకులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిపై చర్చించారు. తమ్మినేనికి అభినందించిన వారిలో మాజీ ఎంపీపీ సిమ్మ సాంబమూర్తి, వైస్ ఎంపీపీ శోభన్‌బాబు, సర్పంచ్‌లు, నాయకులు చిన్నారావు, విష్ణు, సజ్జల యోగేశ్వరరావు, కొల్లా రామారావు, రావాడ మన్మథరావు, రెడ్డి సీతారాం, కరణం చంద్రునాయుడు, శెట్టి రామారావు, ఆరిక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీపౌర్ణమి ఉత్సవాలు



సరుబుజ్జిలి: అమ్మవారికి పత్రి కొమ్మలను నివేదిస్తున్న భక్తులు



నరసన్నపేట: గుండవల్లిపేటలో గౌరీపౌర్ణమి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సరుబుజ్జిలి: మండలంలో గౌరీపౌర్ణమి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. నందీశ్వరసహిత గౌరీపరమేశ్వరులకు కుంకుమపూజలు, సహస్ర నామార్చనలు, వ్రతాలు, నోములు చేపట్టారు. గ్రామాల్లో ఆసిరితల్లికి ప్రీతిపాత్రమైన పత్రి కొమ్మలను ఊరేగించి, ఘటాలతో ముర్రాటలు నివేదించారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సారవకోట: గౌరీ పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలో గురువారం నందెన్న ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒడిశాలోని పర్లాకిమిడి నుంచి నంది విగ్రహాలు తీసుకువచ్చి శోభయాత్ర చేపట్టారు. నందెన్న విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేపట్టారు.

నరసన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో గౌరీపౌర్ణమి పూజలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మహిళలు గౌరీ నోములు చేపట్టారు. గుండవల్లిపేట, కోమర్తి, కంబకాయ, రావులవలస, తెలగవలస, చెన్నాపురం, నడగాం, చిక్కాలవలస తదితర గ్రామాల్లో గౌరీ పూజలు నిర్వహించారు. నందెమ్మ ఉత్సవాలు నిర్వహించారు.

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, పారాపురం, మెట్టూరు, నివగాం, కుంటిభద్రలతోపాటు పలు గ్రామాలకు చెందిన మహిళలు గురువారం గౌరీపౌర్ణమి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివపార్వతుల విగ్రహాలను ప్రతిష్ఠించారు.



సారవకోట: వడ్డినవలసలో ఏర్పాటు చేసిన నందెన్న విగ్రహం



కొత్తూరు: దేవర వీధిలో గౌరీపౌర్ణమి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఇన్‌చార్జి పాలనతో కాలయాపన



సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్

సరుబుజ్జిలి: స్థానిక పోలీస్ స్టేషన్‌కు సుమారు 2 నెలలుగా రెగ్యులర్ ఎస్సై పోస్టు నియామకం చేయలేదు. సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయి. మండల వ్యవస్థ ఏర్పడిన తరువాత సరుబుజ్జిలిని 2 మండలాలుగా విభజించి కొత్తగా ఎల్ఎన్‌పేటను మండలంగా ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడిన మండలాలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసినప్పటికీ ఎల్ఎన్‌పేటకు పోలీస్ స్టేషన్ మంజూరుచేయలేదు. అప్పటినుంచి ఈ రెండు మండలాల్లోని 44 పంచాయతీలకు ఇదే స్టేషన్ ఆధారంగా ఉంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సీతంపేట, సోంపేట, భామిని, సంతబొమ్మాళి మండలాలకు రెండు చొప్పున పోలీస్ స్టేషన్లు ఉండగా.. ఇక్కడ రెండు మండలాలకు ఒకే పోలీస్ స్టేషన్ ఉంది. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న నిహార్ ఇటీవల బదిలీల్లో భాగంగా వజ్రపుకొత్తూరుకు వెళ్లారు. అప్పటినుంచి వీఆర్‌లో ఉన్న ఎస్ఐను ఇన్‌చార్జిగా వేయగా, మరలా ఇటీవల టాస్కఫోర్స్ ఎస్ఐగా బదిలీ చేశారు. రెగ్యులర్ ఎస్ఐ లేకపోవడం వల్ల పలు సంఘటనల పరిష్కారంలో కాలయాపన జరుగుతుందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ అధికారులు స్పందించి రెగ్యులర్ ఎస్ఐ నియామకం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వాల్మీకి చరిత్ర స్ఫూర్తిదాయకం



వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

సరుబుజ్జిలి: బోయవానిగా ఉండి మహాకవిగా మారిన వాల్మీకి చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శదాయకమని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర తెలిపారు. వాల్మీకి జయంతి సందర్భంగా కళాశాల ఆవరణలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం అందరికీ స్ఫూర్తిదామకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ రమేష్‌సాహు, అధ్యాపకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారీ వర్షం



కాలేజీ రోడ్డు కూడలిలోని మెయిన్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



నరసన్నపేటలో కురుస్తున్న వర్షం

నరసన్నపేట: మండలంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. గంటకు పైగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నరసన్నపేటలోని రోడ్లుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైన్లపై, ఫుట్‌పాత్ వ్యాపారం చేస్తుండటంతో అవి పూర్తిగా మూసేశారు. డ్రైన్లలో వెళ్లాల్సిన నీరు రోడ్లపైనే చేరింది. కాలేజీ కూడలి వద్ద మురుగునీరు రోడ్డుపైకి రావడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. శివనగర్ కాలనీ, బజారు వీధుల్లో నీరు అధికంగా చేరింది.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



మామిడివలసలో రోడ్డు పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని ఉప్పరిపేట, లకిమేర, మామిడివలస గ్రామాలకు ఉపాధి నిధులు రూ.3.70 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించనున్నామని తెలిపారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో పర్యటించి ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌హెచ్ నుంచి లకిమేర మీదుగా సత్యవరం వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉప్పరిపేటకు రూ.2 కోట్లతో రోడ్డు పనులు చేపట్టనున్నట్లు వివరించారు. మంచి నీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

నరసన్నపేట: మండలంలోని కోమర్తి గ్రామంలో జల్ జీవన్ మిషన్ పనులు రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ భాషా అన్నారు. గ్రామంలో మంచి నీటి సమస్యపై జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌కు చల్ల స్వామిబాబు ఇటీవల ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామానికి వచ్చి పరిశీలించారు. గ్రామంలో మంచినీటి సమస్యపై ఆరా తీశారు. పంచాయతీ కార్యాలయం వద్ద మంచినీటి ట్యాంక్ నిర్మాణం జరిగిందని, ఇప్పటివరకూ దీనిని వినియోగించలేదని స్వామిబాబు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ దృష్టికి తీసుకువచ్చారు. దీనిని వినయోగంలోనికి తీసుకువచ్చి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టనున్న పనులకు ఈ ట్యాంకు అనుసంధానం చేస్తామని ఎస్ఈ తెలిపారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించి డిసెంబర్ ఖరుకల్లా పనులు పూర్తి చేసి, సంక్రాంతికి నీరు అందిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. ఈయన వెంట ఈఈ రంగప్రసాద్, డీఈ సుదర్శనరావు, ఏఈ కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com